ప్రజాశక్తి
శుక్రవారం 10 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మిర్చి యార్డు కిటకిట

- ఒకేసారి లక్షా 20 వేల టిక్కీలు రాక
- పుంజుకున్న విక్రయాలు
- స్వల్పంగా పెరిగిన ధరలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో రద్దీ కొనసాగుతోంది. గురువారం యార్డుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 1,20,869 టిక్కీలు వచ్చాయి. పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, బళ్లారి జిల్లాల నుంచి ఎక్కువగా మిర్చి గుంటూరు యార్డుకు వస్తోంది. ఒకేసారి లక్షా 20 వేల టిక్కీలు రావడంతో యార్డు ప్రాంగణంలో ఎటుచూసినా మిర్చి టిక్కీలే కన్పిస్తున్నాయి. లారీలు, ట్రాక్టర్లు, మినీ లారీలతో యార్డు పరిసరాలన్నీ కిటకిటలాడాయి. తెల్లవారుజామున భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ధరలు గతనెల కంటే మూడ్రోజులుగా స్వల్పంగా పెరిగాయి. యార్డుకు గురువారం వచ్చినవి, పాత నిల్వలతో కలిపి 1,16,426 టిక్కీలు విక్రయించారు. ఇంకా 81,301 టిక్కీలు నిల్వ ఉన్నాయి.

నాన్ ఎసి రకాలకు కనిష్ట ధర రూ.8 వేలు, గరిష్ట ధర రూ.23 వేలు లభించిందని అధికారులు తెలిపారు. కొన్ని రకాలకు ధరలు మరింత తగ్గగా మరికొన్నింటికి నిలకడగా ఉన్నాయి. 334 రకం కనిష్ట ధర రూ.8 వేలు, గరిష్ట ధర రూ.23 వేలు, నెంబరు 5 రకం కనిష్ట ధర రూ.10 వేలు, గరిష్టం





రూ.21 వేలు, 273 రకం కనిష్టం రూ.14,500, గరిష్టం రూ.18,500, 341 రకం కనిష్టం రూ.8వేలు, గరిష్టం రూ.22 వేలు, 4884 రకం కనిష్టం రూ.10 వేలు, గరిష్టం రూ.15,800, సూపర్ 10 రకం కనిష్టం రూ. 15 వేలు, గరిష్టం రూ.17,800 ధరలు లభించాయని యార్డు అధికారులు వెల్లడించారు. మేలు రకాలైన తేజ

2లో



గుంటూరులో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతు , ప్రజా సంఘాలు

ఆప్పులు, ఆత్మహత్యలు రెట్టింపు

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట బ్లాక్ డే నిరసనలు

4,5లో



నరసరావుపేటలో తపాలా కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘాలు



బాపట్ల జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి జి.గంగయ్య, రైతు సంఘాల నాయకులు

భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వండి

- గుంటూరు ఛానల్ పొడిగింపుపై బాపట్ల జిల్లా కలెక్టర్‌కు అఖిలపక్ష రైతు సంఘాల వినతి
- నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్న నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే చర్యల్లో భాగంగా పర్చూరు మండలానికి నోటిఫికేషన్ ఇచ్చి భూసేకరణను ప్రారంభించాలని, నిధులు కేటాయించి 50 గ్రామాల

2లో



విద్యార్థుల కేరింతలు... మహిళల ఉత్సాహం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నగరంలోని సిద్దార్ధ ఆడిటోరియంలో జరుగుతున్న మహిళా ఫెస్ట్ కార్యక్రమం విద్యార్థుల కేరింతలు... మహిళల ఉత్సాహంతో సందడిగా ముగిసింది. రెండు రోజల పాటు జరిగిన ఈకార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు, మహిళలు వివిధ అంశాలలో పాల్గొంటూ ఉత్సాహంగా గడిపారు. గురువారం జరిగిన పాశ్చాత్య నృత్యం పోటీల్లో కళాశాల విద్యార్థులు చక్కటి నృత్యాలతో అలరించారు. సమాజంలో జరుగుతున్న అంశాలను ఎత్తి చూపుతూ విద్యార్థినులచే ప్రదర్శించిన లఘునాటికలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే ' బెస్ట్ ఫ్రం వేస్ట్ ' ఈవెంట్‌లో పాత వస్తువులు, పారవేసే వస్తువులతో చక్కని ఆకృతులతో తయారుచేసిన ప్రదర్శన ప్రత్యేక హైలెట్‌గా నిలిచింది. వేస్ట్ మెటీరియల్‌తో అందమైన వస్తువులను తయారుచేసి ఇంటిలో అలంకరించుకునే విధంగా తయారుచేసిన విధానం విద్యార్థుల్లో సృజనాత్మకతను తట్టిలేపింది. అలాగే వివిధ పండ్లు, కూరగాయలతో నిర్వహించిన ఫ్రూట్ కార్వింగ్‌లో కళాశాల విద్యార్థినులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు ఎస్‌బిఐ డిజిఎం రంగరాజన్ యూనియన్ బ్యాంక్ ఆర్ఎం రజనీకాంతరావు పలువురు ప్రముఖులు పాల్గొని బహుమతులను అందచేశారు.

మహిళా ఫెస్ట్ - 2023 ఓవరాల్ ఛాంప్‌గా సిద్దార్ధ లా

2లో

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలి

మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టణ త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓ రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిల్వలు ఉన్న సమాచారంతో దాడి చేశామన్నారు. బియ్యం రవ్వ 18 బస్తాలు, బియ్యపుపిండి 10 బస్తాలు, 30బస్తాల్లో నిల్వ ఉంచిన బియ్యం, 805 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోని వాటిని సివిల్ సప్లైస్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ప్రజాశక్తి-తెనాలి

కుటుంబ కలహాల నేపథ్యంలో గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పట్టణ ఒన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాజరుపేటకు చెందిన నక్కా రవికుమార్(32) కూలి పనులకు వెళుతుంటాడు. భార్యతో అతనికి విభేదాలున్నాయి. ఈనేపథ్యంలో ఆమె పుట్టింటికి వెళ్ళి, కాపురానికి రావటానికి నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన రవికుమార్ ఈనెల 5న గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎలుకల మందు తాగి భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-తెనాలి

ఎలుకల మందు తాగి భార్యాభర్తలిరువురూ ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన పట్టణంలోని నందులపేటలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలోని నందులపేటకు చెందిన చెన్నంశెట్టి బాలనాగతిరుమలేష్‌కు ఏడాదిన్నర క్రితం నవ్యశ్రీతో వివాహమైంది. ప్రస్తుతం నవ్యశ్రీ ఆరునెలల గర్భవతి. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే బాలనాగ తిరుమలేష్, ప్రస్తుతం వర్క్ ఫ్రం హోంలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో దంపతులిరువురూ గురువారం మద్యాహ్నం ఎలుకల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు గమనించి, ఆసుపత్రికి తరలించారు. కాగా మెరుగైన చికిత్స నిమిత్తం నవ్యశ్రీని గుంటూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల వాగ్ధానాలకు విరుద్ధంగా ప్రైవేటీకరణ

ప్రజాశక్తి -దుగ్గిరాల

కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలకు విరుద్ధంగా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ చేస్తుందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో సంఘీభావంగా గురువారం పెద్ద కొండూరు గొడవర్రు గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు పర్యటించిమాట్లాడారు. ప్రస్తుతం బిజెపి అనుసరిస్తున్న విధానాలను ఎండగడుతూ మత తత్వ శక్తుల కదంబ హస్తాల నుండి దేశాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ షేక్ సలీం, మండల పార్టీ అధ్యక్షులు కుప్పల శ్రీరామ్ , మూరి, కాంగ్రెస్ కార్యకర్తలు, పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న సర్పంచ్ పి. శివకుమారి

లేవల్లెపాడులో సైడ్ కాల్వలకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ప్రత్తిపాడు: నియోజక వర్గంలోని వట్టిచెరుకూరు మండలంలోని లేవల్లెపాడు గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించే సైడ్ కాలువల గురువారం లేమల్లెపాడు సర్పంచ్ పాతూరు శివకుమారి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎంపి జయదేవ్‌కు గ్రామంలోని డ్రెయినేజ్ వ్యవస్థను వివరించగా స్పందించిన ఎంపి గల్లా జయదేవ్ రూ.10లక్షల గ్రాంట్‌ను ఇచ్చారని పేర్కొన్నారు.

భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించాలని అఖిలపక్ష రైతు సంఘాలు కోరాయి. ఈ మేరకు బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు నాయకులు వినతిపత్రాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని రైతులు, సామాన్య ప్రజలు సాగునీరు, తాగునీటి అవసరాల కోసం 85 ఏళ్ల నుంచి పోరాడుతున్నారన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు ద్వారా బాపట్ల జిల్లా పర్చూరు, పల్నాడు జిల్లా చిలకలూరిపేట, యడ్లపాడు, గుంటూరు జిల్లా కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు మండలాల పరిధిలోని 50 గ్రామాలకు చెందిన 48 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు లభిస్తాయన్నారు. దీర్ఘకాలంగా ఈ ప్రాంత ప్రజానీకం, రైతులు అతివృష్టి లేదా అనావృష్టితో ఇబబ్బందులు పడుతున్నారని, పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. నల్లమడ వాగులో పట్టణ వ్యర్థాలు, మురుగునీరుతో, కలుషితమైన నీటితో సాగు చేయడం వల్ల పొలాలు చవుడు బారిపోతున్నాయని వివరించారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఈ కాల్వ పొడిగింపు పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. పర్చూరు మండలానికి భూసేకరణ కోసం సత్వరమే నోటిఫికేషన్ ఇచ్చి గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు ఎన్.ఆచార్యులు, ఏపీ రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి రామారావు, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, ఎల్‌వి.నాగేశ్వరరావు, జగన్నాథం, నర్రా శ్రీను, ఎం.సాంబశివరావు, ఎం.కిషోర్, ఎం.విజయ్ పాల్గొన్నారు.





సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

విద్యార్థుల కేరింతలు... మహిళల ఉత్సాహం..

(మొదటి పేజీ తరువాయి)

కళాశాల విద్యార్థినులు నిలిచారు. అన్ని విభాగాలలో పాల్గొని పతకాలు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనపరచారు. ఈసందర్భంగా విజేతల వివరాలను పరిశీలిస్తే క్లాసికల్ డ్యాన్స్‌లో మృణాళిని గ్రూప్ (కెవిఎస్‌ఆర్ సిద్దార్థ కళాశాల), ఎస్.జ్యోత్స్న గ్రూప్ (సిద్దార్ద లా కళాశాల), మాలిని అండ్ గ్రూప్ (కెజిఆర్ డిగ్రీ కళాశాల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. జానపద గీతాలాపనలో శ్రావణి గ్రూప్ (నలంద డిగ్రీ కళాశాల), సి.హెచ్. సాయి దుర్గ గ్రూప్ (సిద్దార్ద లా కళాశాల), చాందిని గ్రూప్ (అరుణ కుమారి ఎడ్యుకేషన్ సంస్థ) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించాయి. ఏకపాత్రాభినయంలో విద్యార్థుల విభాగంలో ఆర్. అఖిల , నాగవల్లి, (సిద్దార్థ మహిళా కళాశాల), రంగ గోపిక (సిద్దార్థ లా కళాశాల) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. అభ్యుదయ దేశభక్తి గీతాలలో విజయశాంతి, సాయి సుష్మిత, దివ్య శ్రీ వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. బెస్ట్ ఫ్రం వేస్ట్‌లో ఎస్.కె. షాహిరున్నీసా , డి.లీలా లిఖిత, వి.మౌనిక మొదటి మూడు స్థానాలు సాధించారు. వెజిటబుల్ ఫ్రూట్ కార్వింగ్‌లో సంపద (సిద్దార్ద లా కళాశాల), పి.అమ్రీన్‌ (నలంద కళాశాల), కె.వసుధ (లయోలా కళాశాల) మొదటి మూడు స్థానాలు సాధించారు. వ్యాసరచన తెలుగులో విజయలక్ష్మి (సిద్దార్ద లా కళాశాల), వి.శ్రీ మైనిక (విట్ కళాశాల), అనూషా (లా కళాశాల) మొదటి మూడు స్థానాలు సాధిలంచారు. వ్యాసరచన ఇంగ్లీసు విభాగంలో విజయదుర్గ (సిద్దార్ద లా కళాశాల), పుష్పాల మోహన సాయి (విట్ కళాశాల), కె.శ్రీ శ్రావణి (సిద్దార్థ కళాశాల) మొదటి మూడు స్థానాలు సాధించారు.

ఆర్థిక స్థితికి పొంతన లేని బడ్జెట్

రాజ్యసభ మాజీ సభ్యులు యలమంచిలి శివాజీ

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర బడ్జెట్ ప్రస్తుత ఆర్థిక వ్యవస్థకు పొంతన లేని బడ్జెట్‌గా ఉండని మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో అర్థశాస్త్ర శాఖోపన్యాసకులు సిహెచ్.సుబ్బారెడ్డి అధ్యక్షతన కేంద్ర బడ్జెట్ విశ్లేషణ సభ నిర్వహించారు. సభలో శివాజీ మాట్లాడుతూ బడ్జెట్‌లో పేర్కొన్న మూడు ప్రధానాంశాలు ప్రభుత్వ మూలధన వ్యయాలు, సంక్షేమ వ్యయాలు, కొత్త పన్నుల విధానం పలు సందేహాలకు తావిస్తున్నాయని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల స్థితిగతుల గురించి, ఆర్థిక సర్వేలో కేంద్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు చేసిన ప్రస్తావనలకు, హెచ్చరికలకు అనుగుణమైన చర్యలు బడ్జెట్‌లో కనిపించలేదని పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో మూలధన వ్యయాలకు కేటాయించిన నిధులు ఖర్చు పెట్టటంలో విఫలైమన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో మూలధన వ్యయాలకు సంబంధించిన అంచనాను 33 శాతం అధికం చేశారన్నారు. సంక్షేమ వ్యవయాలను పెద్ద ఎత్తున తగ్గించి, అణగారిన వర్గాల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్ర మంత్రులు ప్రకటిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు అరవై వేల కోట్లకు తగ్గించటం దిగ్భ్రాంతికి గురి చేస్తుందన్నారు. గ్రామీణాభివృద్ధి రంగానికి నిధులు తగ్గించారని, విద్య, వైద్య రంగాలకు కేటాయింపుల్లో నామమాత్రపు పెరుగుదల చూపించారన్నారు. విదేశీ బ్యాంకుల్లోకి దొంగచాటుగా ప్రవేశించిన డబ్బును తిరిగి దేశంలోకి తెచ్చి, ఒక్కొక్క కుటుంబానికి రూ.15 లక్షలు చొప్పున పంచుతానన్న కేంద్రం, దేశంలో ఒక్కొక్క పౌరుడికి రూ. 2 లక్షల అప్పు చేతిలో పెట్టిందని విమర్శించారు. ఈ విశ్లేషణలో ఆర్థికవేత్త డాక్టర్ జి.సుధాకర్, ఆడిటర్ ఎం.భాస్కర్‌రెడ్డి, సూరయ్య చౌదరి, న్యాయవాది ఎ.హరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలిపితే బెదిరింపులు

ప్రజాశక్తి-తాడేపల్లి

తమ గ్రామంలో సంచార వైద్య బృందాలు ఎప్పుడు వస్తున్నారో, వెళ్తున్నారో తెలియడం లేదని స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఓ మహిళ సమస్యను వెలిబుచ్చింది. దీంతో ఆమెకు కొందరు ఫోన్‌చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ఘటన గురువారం ఉండవల్లిలో చోటు చేసుకుంది. సమస్యలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే ఆర్కే, గంజి చిరంజీవి, ప్రభుత్వ అధికారులతో కలిసి పాత వాటర్ ట్యాంక్ వద్దకు వెళ్ళారు. స్థానిక మహిళా పద్మ ఎమ్మెల్యే వద్దకు వచ్చి తమ గ్రామానికి గతంలో వైద్య బృందాలు వచ్చి కంటి పరీక్షలతో పాటు ఉచితంగా అన్ని పరీక్షలు నిర్వహించేవారని, ప్రస్తుతం ఎవరూ రావడం లేదనే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మహిళ చెప్పిన విషయాలను ఓపికగా విన్న ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. సమస్యను తెలిపిన పద్మకు ఉండవల్లిలోని ఇద్దరు ముగ్గురు నుండి బెదిరింపుకాల్స్ వచ్చాయి. ఎంత ధైర్యముంటే ఎమ్మెల్యేను నిలబెట్టి సమస్య అడుగుతావంటూ ల్యాండ్ లైన్‌తో పాటు సెల్‌ఫోన్ కాల్స్ ద్వారా ఆమెను బెదిరించారని వాపోయింది. ఓట్లు అడిగే హక్కు వారికి ఉన్నప్పుడు సమస్యలు అడిగే హక్కు తమకు ఉండదా అని ఆ మహిళ వాపోయింది.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

మిర్చి యార్డు కిటకిట

(మొదటి పేజీ తరువాయి)

క్వింటాళ్ కనిష్టం రూ.7 వేలు, గరిష్టం రూ.20 వేలు, బాడిగ రకం కనిష్టం రూ.8 వేలు, గరిష్టం రూ.25 వేలు, దేవనూరు డీలక్స్ కనిష్టం రూ.9500, గరిష్టం రూ.21 వేలు లభించాయి. గత నెలలో కనిష్ట ధర రూ.10 వేల వరకు పలకగా ప్రస్తుతం రెండు వేల వరకు తగ్గింది.

గత నెలలో నాణ్యమైన సరుకు వచ్చినప్పుడు సగటు ధర రూ.20 నుంచి రూ.22 వేలు ఉండగా ప్రస్తుతం రూ.17 వేల నుంచి రూ.20 వేల మధ్యన వస్తుందని చెబుతున్నారు. సగటున గరిష్టంగా రూ.15 వేలకు మించి ధర వస్తుంది. మొత్తంగా గత కొన్ని రోజులుగా కనిష్ట ధర రూ.8 వేలు, గరిష్ట ధర రూ.17 వేలు సగటున ఉంటోంది. గత అక్టోబరులో అధిక వర్షాలు, మాండూస్ తుపాను వల్ల పైరు తడిసిన ప్రాంతాల్లో కొంత మేరకు నాణ్యత తక్కువగా ఉన్నట్టు వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని రైతులు చెప్పారు. ప్రతి రకంపై కనిష్టంగా రూ.వెయ్యి వరకు పెరిగినట్టు వ్యాపార వర్గాలు తెలిపాయి. గుజరాత్, మహరాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు పెద్ద సంఖ్యలో గుంటూరు యార్డుకు రావడం వల్ల ధరలు పెరుగుదల ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం విదేశీ ఆర్డర్లు ఇంకా ఖరారు కాలేదని దేశీయ మార్కెట్‌కు డిమాండ్ ఉందని వ్యాపారులు తెలిపారు.



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రోహిణీ

గ్రామాల అబివృద్ధి నిరంతర ప్రక్రియ

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

గ్రామాల అబివృద్ధి నిరంతర ప్రక్రియ అని డిప్యూటీ కమిషనర్ రోహిణి అన్నారు. గురువారం మండలంలోని నడిపాలెంలో నిర్వహించిన లోకల్ ట్రైయినింగ్ క్యాక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ నడింపాలెంలోని గ్రామపంచాయతీకి వస్తున్న క్రమంలో రోడ్డుకి ఇరువైపులా చెత్త వెయ్యకుండా ఏర్పాటు చేసిన బోర్డులు, శానిటేషన్ కార్యక్రమాలు బాగున్నాయని ఆమె తెలిపారు. డోర్ టు డోర్ శానిటేషన్ చేసినప్పుడు తడి చెత్త ,పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలని తెలిపారు. గ్రామంలోని ఒక పది గృహాలను సందర్శించారు వారిని తడి చెత్త, పొడి చెత్త వ్యత్యాసాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో డిపిఒ కేశవ రెడ్డి, డిపిఆర్‌సి శ్రీదేవి, చేబ్రోలు ఎంపీడీఓ బాబూరావు, డిస్ట్రిక్ రిసోర్స్ పర్సెన్లు అమరేశ్వరరావు, నాగ నందం, ప్రత్తిపాడు ఎంపీడీఓ శ్రీరమ్య, ఈవోపీఆర్డీ మోషే, పంచాయతీ కార్యదర్శి ఖాజావలి, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రాలు, వాలంటీర్లు పాల్గొన్నారు



పేద విద్యార్థులకు చేయూతనిస్తాం..

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

గ్రామీణ ప్రాంతాల వ్యవసాయ ఆధారిత కుటుంబాల నుంచి చదువులో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థుల చదువుకు చేయూతనిస్తానని అశోక పాఠశాల పూర్వ విద్యార్థి ఎన్‌ఆర్‌ఐ పి.తేజస్వి అన్నారు గురువారం సాయత్రం అశోక పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో వారు మాట్లాడారు విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన పదో తరగతి విద్యార్థులు ఏ కళాశాలలో చేరిన ఇంటర్మీడియట్ ఫీజు చెల్లిస్తానన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పోపూరి లక్ష్మీనారాయణ. తేజస్విని నరహర గోపాల్ (ఎన్‌ఆర్‌ఐ) దంపతులను సత్కరించి అభినందించారు.



కుక్కను తప్పించబోయి
బస్సును ఢీ కొట్టిన కారు

ప్రజాశక్తి-నాదెండ్ల

ఆర్టీసీ బస్సును కారు ఢీ కొట్టిన సంఘటన మండలంలోని సాతులూరు పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. నాదెండ్ల ఎస్ఐ ఆవుల భాస్కర్ తెలిపిన వివరాలు ప్రకారం వినుకొండ నుండి విజయవాడ వైపు ఆర్టిసి ఎక్స్‌ప్రెస్ బస్సు, గుంటూరు నుండి నరసరావుపేట వైపు కారు వెళుతున్నాయి. పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేసరికి కుక్కని తప్పించబోయిన కారు బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ఇరువురికి ప్రాణప్రాయం తప్పింది. చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారు నరసరావుపేటకు చెందిన ఓ ప్రైవేట్ స్కూలు యాజమాన్యంగా గుర్తించారు. ఈ సంఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్రమాద ఘటనతో సుమారు అర్ధగంట పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నరసరావుపేట

పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, పూజిత హాస్పిటల్ అధినేత డాక్టర్ ముంద్రు సుబ్బారావు ఈ నెల 4వ తేదీ నుండి కనిపించడం లేదని, ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని భార్య ముంద్రు సృజన కుమారి 1వ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్.ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుబ్బారావు గతంలో కూడా ఇదేవిధంగా చెప్పకుండా వెళ్లి నలభై రోజుల తర్వాత తిరిగి వచ్చారని,రైస్ పుల్లింగ్ వ్యాపారం పేరిట రూ. 2 కోట్ల మేర అప్పులు అయ్యాయని ఆవేదన చెందేవాడని ఆయన భార్య చెప్పినట్లు పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

టైరు పంక్చర్‌తో బోల్తా కొట్టిన లారీ



ప్రజాశక్తి-నకరికల్లు

అతివేగంతో వెళుతున్న వాహనం రోడ్డుపై బోల్తా కొట్టిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం, పిడుగురాళ్ల నుండి చెన్నై వెళుతున్న పరదా పట్టాల లారీ నకరికల్లులోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి వై-జం క్షన్‌లోని గంగమ్మ గుడి వద్ద ముందు టైర్ పగిలింది. దీంతో, అదుపుతప్పిన లారీ బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు.



ప్రథమ చికిత్సపై వాలంటీర్లు, ఆశ వర్కర్లకు అవగాహన

ప్రజాశక్తి-నరసరావుపేట

బెల్లంకొండ, అమరావతి, అచ్చంపేట, రెంట చింతల, నదీ పరివాహక ప్రాంతాల వాలంటీర్లు, ఆశ వర్కర్స్ రెండవ బ్యాచ్ కు ప్రథమ చికిత్సపై గురువారం శిక్షణ ఇచ్చినట్లు పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్, కొండవీడు ఈ.ఎన్.టి హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.

. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతి రాజ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో కోటప్పకొండ సెడప్ ట్రైనింగ్ సెంటర్‌లో రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా శాఖ వారికి ఈ శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి, అగ్నిప్రమాదాలు కు గురైన వారికి, వైద్యశాలకు వెళ్లే లోపు ప్రథమ చికిత్స ఏవిధంగా చేయాలి, గుండెపోటుకు గురైన వారికి సి.పి.ఆర్ చేసే విధానం, గుండెపోటు లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి నరసరావుపేట మహాత్మాగాంధీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నరేంద్ర, రెడ్ క్రాస్ కోఆ ర్డినేటర్ పి.వెంక టేశ్వరరావు వివరించారు.

'జ్ఞానేశ్వర' ఉచితవైద్య శిబిరం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి, పేదలకు మందులు పంపిణీ చేస్తామని సంస్థ చైర్మ న్ షేక్ జాన్ సైదా అన్నారు. గురువా రం స్థానిక రజక కాలనీలో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి సీనియర్ నాయకులు కొడారి నెహ్రు ఇంటికి వెళ్ళిన జాన్ సైదా, ఆయనకు రూ. 5 వేల ఆర్థిక సాయం చేశారు. కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, వైసిపి యడ్లపాడు మండలం మాజీ అధ్యక్షులు చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, షేక్ కరి ముల్లా, బివి రెడ్డి, కారచోల విజయభాస్కర్‌రెడ్డి, ఎంవి రత్నారెడ్డి, కరిముల్లా, ఎం.శేషిరెడ్డి, ఎన్. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





ముఖ్యమంత్రి పీఠమే బిఎస్పి లక్ష్యం

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్

ముఖ్యమంత్రి పీఠాన్ని బిసిలు అధిరోహించడమే బహుజన సమాజ్ పార్టీ లక్ష్యం అని బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు బొక్క పరంజ్యోతి అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహంవద్ద రాజ్యాధికార యాత్ర 15వ రోజు సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సభలోఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బిసిలకు వంద సీట్లు కేటాయించామని, బిసి నాయకులే ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడే భాధ్యత బిఎస్పీ దేనని అన్నారు. అనంతరం అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు .

నాయీబ్రాహ్మణ కుటుంబానికి న్యాయం చేయండి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

నిరుపేద నాయీబ్రాహ్మణ కుటుంబం తమకు న్యాయం చేయాలంటూ స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ వద్ద శాంతియుతంగా దీక్ష చేస్తున్న వారి శిబిరాన్ని పోలీసులు, రెవిన్యూ సిబ్బం ది కలిసి తొల గించడాన్ని ప్రజా సంఘాలు ఖండించాయి. బాధిత కుటుంబంతో కలిసి ప్రజా సంఘాలు గురువారం ఎమ్మార్వో ఆఫీ సు వద్ద మీడియా సమావేశం నిర్వ హిం చారు. ఈ సందర్భంగా ప్రజా సం ఘాల నాయకులు మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్ట ణానికి చెందిన ముక్కరాల వెంకట నరసమ్మ భర్త శ్రీనివాసరావుకు పిడుగురాళ్ల సూర్యా సెమ్ సమీపంలో సర్వే నెంబర్ 96/ఎలో తన పూర్వీకుల ద్వారా 2.70 సెంట్లు భూమి కలిగి ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందుల రీత్యా మొదట 1.50 సెంట్లు, ఆ తర్వాత 1.00 సెంట్లు విక్ర యించాడు. మిగిలిన 20 సెంట్ల భూమి 24/4/21న తన భార్య పేరుతో రిజిస్టర్ చేశాడు. అయితే, రాష్ట్ర సమాచార కమిషనర్ (ఆర్టిఐ), పిడుగు రాళ్లకు చెందిన, ఆర్యవైశ్యులు రేపాల శ్రీని వాస రావు ఈ 20 సెంట్ల భూమిని కబ్జా చేసి, 01/06/22న ఆన్‌లైన్‌లో తన పేరుతో మార్చుకోవడం జరిగింది. ఈ విషయమై వెంకట నర సమ్మ జిల్లా కలెక్టర్‌కు, పిడుగు రాళ్ల ఎమ్మార్వోకు అర్జీలు పెట్టినా ఫలితం లేదు. తమ సమస్యను పరిష్కరిం చాలని కోరుతూ గత నాలుగు రోజుల నుండి స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట శిబి రం ఏర్పాటు చేసుకొని శాంతి యుతంగా దీక్ష చేస్తున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కుటుం బంతో కలిసి గురువారం నిరసన తెలియజేసింది. దీక్షా శిబిరంలో ప్రజా సంఘ నాయకులతో మాట్లాడుతున్న సమ యంలో పోలీసులు అక్కడికి వెళ్లి దౌర్జ న్యంగా ఎమ్మార్వో కంప్లైంట్ ఇచ్చారంటూ ఆ శిబిరాన్ని తొలగించారని చెప్పారు. రేపాల శ్రీనివాసరావు, వైసిపి నాయ కుడిగా ఉండి, నాయీబ్రాహ్మణ కుటుంబానికి చెందిన 20 సెంట్ల భూమిని ఆక్ర మించడం చట్టరీత్యా నేరమని అన్నారు. రికార్డులు తారు మారు చేసి పేదల భూమిని ఆక్రమించిన ఆయనపై చర్యలు ఎందుకు తీసు కోరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే శ్రీనివాసరావును, అతనికి సహకరించిన రెవెన్యూ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ఆ భూమిని తిరిగి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. పిడిఎం, ఆర్టిఐ, తదితర ప్రజా సంఘాలు వీరికి మద్దతు తెలిపారు. సిపిఐ టౌన్ కార్య దర్శి జె.కృష్ణనాయక్, ఎంసిపిఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, బాధిత కుటుంబన భ్యులు శ్రీనివాసరావు, అనిల్, మణి శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,20,859
మిర్చి ఎగుమతి	: 1,16,426
మిర్చి నిల్వ	: 81,301

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 23,000
నెం.5	10,000 - 21,000
273	14,500 - 18,500
341	8,000 - 22,000
4884	10,000 - 15,800
సూపర్ 10	15,000 - 17,800
నాన్ ఎసి	
తేజ	7,000 - 20,000
బడిగి	8,000 - 25,000
దేవనూరు డీలక్స్	9,500- 21,000
తాలుకాయలు	4,500 - 12,500

అప్పులు, ఆత్మహత్యలు రెట్టింపు

- బడ్జెట్‌లో కోత విధిస్తే రైతుల ఆదాయం ఎలా రెట్టింపు అవుతుంది?
- రైతు సంఘాల నాయకుల ఆగ్రహం
- కేంద్ర బడ్జెట్‌పై పలుచోట్ల బ్లాక్ డే నిరసనలు
- కేంద్ర ప్రభుత్వ సంస్థల ఎదుట ఆందోళన



యడ్లపాడు పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు



ముప్పాళ్లలో నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి - నరసరావుపేట

వ్యవసాయానికి బడ్జెట్లో నిధులు తగ్గించి రైతుల ఆదాయాన్ని ఎలా రెట్టింపు చేస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని రైతు నాయకులు నిలదీశారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పల్నాడు జిల్లాలోని పలు చోట్ల రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో బ్లాక్ డే ఆందోళనలు చేశారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని తపాల కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు మాట్లాడుతూ ఎరువులు, ధాన్య సేకరణకు, విత్తనాలకు ఇస్తున్న రాయితీలు కుదించడమే రైతు సంక్షేమమా అని ప్రశ్నించారు. రాయలసీమను ఎడారి చేసే కర్నాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5300 కోట్లు కేటాయించి, రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు కేవలం రూ.300 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. వెనుక బడిన పల్నాడు ప్రాంతంలో నాలుగు మండలాలకు సాగు, తాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టుకు కనీసం అటవీ అనుమతులు ఇవ్వకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు. దేశ సంపద మొత్తాన్ని మోడీ రెండు కుటుంబాలకు దోచి పెడుతున్నారని, 70 శాతం ప్రజలు ఆధారపడ్డ వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. నకిలీ, కల్తీ విత్తనాలు, ప్రకృతి విపత్తుల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు సమగ్ర బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయడానికి బడ్జెట్లో రూ.లక్ష కోట్లు కేటాయించాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతు ఉద్యమ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలైన మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం చేయాలని, రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరిగి రైతులు రుణాల ఊబిలో కూరుకుపో తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఏపీ రైతు సంఘం నాయకులు యు.రాము మాట్లాడుతూ వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని, విభజన చట్టం హామీలను పూర్తిగా తుంగలో తొక్కారని విమర్శిం చారు. కిసాన్ మహాసభ జిల్లా నాయకులు టి.ఆంజనేయులు మాట్లాడుతూ రైతులను ఆదుకుంటానని చెప్పినటువంటి ప్రభుత్వం ఆచరణలో మాట తప్పిందని, కావున రాబోయే కాలంలో ఈ ప్రభుత్వాలకు రైతులు, ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ధర్నాలో వివిధ సంఘాల నాయకులు జి.బాలకృష్ణ, డి.శివకుమారి, హుస్సేన్, మస్తాన్‌వలి, సుభాష్ చంద్రబోస్, బి.నాగేశ్వరరావు, కె.అంజనేయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని పోస్టాఫీసు వద్ద రైతులు, కూలీలు నిరసన తెలిపారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ధాన్యం, పత్తి మద్దతు ధరలకోసం గతంలో ఇచ్చిన రూ.2280 కోట్లు కూడా ఈ సారి కేటాయించలేదని, ఎరువుల ధరలు 20 శాతం పెరిగినా సబ్సిడీలను కోశారని, ఉపాధి హామీకి 33 శాతం నిధులు తగ్గించారని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోడీ గతంలో ప్రకటించగా వాస్తవంలో మాత్రం అప్పులు, ఆత్మహత్యలు, ధరలు రెట్టింపయ్యాయని దుయ్యబట్టారు. ఇదే సమయంలో అదానీ ఆస్తులు 20 రెట్లు పెరగడానికి ప్రధాని మోడీ దోహదపడ్డారని విమర్శించారు. 50 శాతం ప్రజల వద్ద 3 శాతం సంపదే ఉండగా ఒక్క శాతం మంది వద్ద మాత్రం 40 శాతం సంపద పోగుపడిందని అన్నారు. వారిపై పన్నులు వేయకుండా సంక్షేమ పథకాలకు కోతలు పెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య, వివిధ సంఘాల నాయకులు కె.రామారావు, జె.శంకరరావు, జి.హరిబాబు, పి.సుబ్బా రావు, ఎన్.కాళిదాసు, ఎ.సుబ్బారావు, టి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండల కేంద్రమైన ముప్పాళ్లలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ మాట్లాడారు. రూ.లక్ష కోట్లకు పైగా ఇచ్చిన రైల్వే బడ్జెట్‌నూ పేదలు ప్రయాణించే రైళ్లకు కేటాయింపులు లేవని అన్నారు. 700 ప్యాసింజర్ రైళ్లను, 10 వేల స్టేషన్‌లను రద్దు చేయడం సరికాదన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు టి.అమరలింగేశ్వరరావు, నరసింహారావు, ప్రసాద్, ఏడుకొండల, శ్రీను, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న పత్తిపాటి పుల్లారావు తదితరులు

రాజధాని విషయంలో ప్రజల్ని మోసం చేస్తున్న సిఎం జగన్ : టిడిపి

ప్రజాశక్తి - వినుకొండ

రాజధాని విషయంలో రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోసం చేస్తున్నాడని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు విమర్శించారు. ఈ మేరకు పట్టణంలోని జీవీ ఆంజనేయులు నివాసంలో గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు. కోర్టులో రాజధాని కేసు నడుస్తుండగానే విశాఖకు రాజధానిని తరలిస్తున్నామని సిఎం వ్యాఖ్యానించడం కోర్టు ధిక్కరణేనని అన్నారు. న్యాయస్థానాలు, చట్టం అంటే ఆయనకు గౌరవం లేదని, రాజ్యాంగాన్ని అనుసరించని వ్యక్తి సిఎంగా కొనసాగే హక్కు లేదని విమర్శించారు. దోచుకున్న విశాఖ భూములు దాచుకోవడానికా రాజధాని విశాఖకు? అని ప్రశ్నించారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. వివేకానందరెడ్డి హత్య జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంతో ముడిపడి ఉందని, సిబిఐ కేసులో ఒకవైపు, సొంత పార్టీలో తిరుగుబాటు మరోవైపు జరుగుతున్నడంతో ముందస్తు ఎన్నికలకు సిద్ధమైనట్లు తెలిసిందని అన్నారు. టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బెదిరింపు పాలన సాగుతోందని, ప్రశ్నించిన వారికి పథకాలు, పెన్షన్లు కట్ చేస్తున్నారని విమర్శించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను ఎవరూ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి నేతలకు ధైర్యం నిజాయితీ ఉంటే మేధావుల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దోపిడీ, మాఫియా, గంజాయి, మద్యం, ఇసుక మాఫియా, లాంటి రత్నాలు కొనసాగుతున్నాయని ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.ఏడుకొండలు, ఎం.కొండలు, ఎ.ఖాసిం పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మాణంపై పరిశీలన

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని గణపవరం, అప్పాపురం గ్రామాల మధ్య అండర్ పాస్‌ను నిర్మించాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు రైతులతో కలిసి ఇటీవల విజయవాడలోని జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారికి విన్నవించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని ఇంజినీర్ కె.వెంకటసోమరాజు గురువారం పరిశీలించారు. అండర్‌పాస్ లేకపోతే రైతులకు ఎదురయ్యే సమస్యలను మాజీ సర్పంచ్ హిమంతరావు, రైతులు వివరించారు. సర్వీస్ రోడ్డుకు గోడ నిర్మిస్తారని తెలిసిందని, అదే జరిగితే ఇబ్బంది పడతామని, పొలాల్లోకి వెళ్లలేమని తెలిపారు. సర్వీసు రోడ్డుకు కాకుండా ప్రధాన రహదారికి గోడ నిర్మిస్తే తమకు అభ్యంతరం లేదని చెప్పారు.

గురుకులం విద్యార్థినులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు గురువారం రక్త పరీక్షలు నిర్వహించారు. 10-19 ఏళ్ల వారిలో హిమగ్లోబిన్ శాతం నిర్ధారణ కోసం ఈ పరీక్షలు చేసి రక్త హీనత ఉన్న పలువుర్ని గుర్తించి ఐరన్ టాబ్లెట్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నందిగామ సబ్ సెంటర్ సిహెచ్‌ఒలు గణేష్, కౌసల్య ఆరోగ్య సిబ్బంది షరీఫ్ విజయరాణి, మల్లేశ్వరి, ఆశా కార్యకర్త కోటేశ్వరమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.



జీతాలందక ఉపాధ్యాయుల ఇక్కట్లు : యుటిఎఫ్



ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఉపాధ్యాయులకు జనవరి నెల వేతనాలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్న శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సత్తెనపల్లి శాఖ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటికీ జీతాలు రాక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని, ఎంతోమంది టీచర్లు బ్యాంకుల్లో డిఫాల్టర్స్‌గా మారే ప్రమాదం ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం యుటిఎఫ్ సత్తెనపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా అవ్వారు రవీంద్రనాథ్ ఠాగూర్, నంచుల విష్ణుమూర్తి, గౌరవ అధ్యక్షులుగా పొన్నం వెంకటేశ్వర్లు, సహాయ అధ్యక్షులుగా బివి శేషురెడ్డి, మహిళా సహాధ్యక్షులుగా సామి వాసవి కన్యక, ట్రెజరర్‌గా సయ్యద్ తాజుద్దీన్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎన్.కుమార రాజా, ఎన్నికల నిర్వాహకులుగా జిల్లా కార్యదర్శి చిన్న శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.కిషోర్ కుమార్ వ్యవహరించారు. నరసింహారావు, పాష, బుర్ర వెంకటరావు, శేషగిరి, అహ్మద్ బాషా, గౌస్, భద్రయ్య, శ్రీనివాసరెడ్డి, పుప్పాల, రియాజుద్దీన్, ముసునూరి పాల్గొన్నారు.

సత్తెనపల్లి మండలం నూతన కమిటీ ఎన్నిక

చేనేత వస్త్రాలను కొని ప్రోత్సహించండి

ప్రదర్శనను సందర్శించిన పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. జిల్లా చేనేత - జౌళి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శనను ఏర్పాటు చేశారు.



ప్రదర్శనను గురువారం సందర్శించిన కలెక్టర్ మాట్లాడుతూ 15వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని, ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తారని చెప్పారు. తెలంగాణ, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ నుండి ప్రముఖ చేనేత ఉత్పత్తులను ఇక్క అమ్ముతారని చెప్పారు. 40 స్టాల్స్‌లో చేనేత ఉత్పత్తులు ఉంటాయని తెలిపారు. అందరూ వీటిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత - జౌళి శాఖ సహాయ సంచాలకులు వనజ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన



మంగళగిరి మండలం కాజలో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు :రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌ను నిరశిస్తూ గుంటూరు జిల్లాలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. గురువారం బ్రాడీపేట మెయిన్ రోడ్డు, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు, కడప ఉక్కు, విశాఖ రైల్వే జోన్‌కు నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేదని, ఈ బడ్జెట్ అన్ని విధాలుగా రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. ఈ బడ్జెట్‌ను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈమని అప్పారావు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీకి గత బడ్జెట్ కంటే రూ.30 వేల కోట్లు తగ్గించి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని, సంక్షేమ రంగానికి, వ్యవసాయ రంగాలకు నిధులు తగ్గించారన్నారు. సిపిఐ (ఎంఎల్) నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించలేదని, ఈ బడ్జెట్ ఆదాని, అంబానీలకు అనుకూలంగా ఉందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను అందరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కె.కృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు హనుమంతురావు, రైతు రక్షణ వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వేణుగోపాలరావు, ఎఐఎఫ్‌టియు నాయకులు కె.కోటయ్య తదితరులు పాల్గొన్నారు. **తాడికొండ :** తాడికొండలో తపాలా కార్యాలయం వద్ద మండల రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు కనగాల పూర్ణచంద్రరావు, నాయకులు చింతల భాస్కరరావు, రైతులు కందుల రామారావు, తియ్యగూర పిచ్చిరెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు. **ఫిరంగిపురం:** ఫిరంగిపురం మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద నిరసనలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, మండల రైతు సంఘం నాయకులు వై నాగేశ్వరరావు, ఎ అంకమ్మరావు, సిహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **దుగ్గిరాల :** దుగ్గిరాల స్టేట్ బ్యాంక్ వద్ద రైతు కౌలు రైతు , వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు సంఘాల ఆధ్వర్యంలోబడ్జేట్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా జరిగింది. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, రైతుసంఘం మండల కార్యదర్శి యం నాగమల్లేశ్వరావు, అధ్యక్షుడు అమ్మిరెడ్డి, నాయకులు కె. కోటయ్య, రమేష్, వి సాంబశివరావు పాల్గొన్నారు. **మంగళగిరి రూరల్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్ను నిరసిస్తూ మంగళగిరి మండలం కాజా గ్రామంలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద బడ్జెట్ ప్రతులను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్, వ్యకాస జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, నాయకులు భీమిరెడ్డి కోటేశ్వరి, టి ప్రసాద్‌రెడ్డి, వల్లూరి భారతి, అప్పికట్ల ప్రకాష్, వి పూర్ణయ్య, సుమ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాల ఎస్‌బిఐ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



ఫిరంగిపురంలో



తాడికొండలో

ఏప్రిల్ 5న చలోఢిల్లీని జయప్రదం చేయండి

మంగళగిరి రూరల్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక ,కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే ఆందోళనలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. మంగళగిరి మండలంలోని కాజా గ్రామంలో సుందరయ్య భవన్లో మండల సదస్సు జరిగింది. మంగళగిరి మండల కార్యదర్శి భీమిరెడ్డి కోటేశ్వరి అధ్యక్షతన సదస్సులో అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో 60,000 కోట్లు కేటాయించిందని గత బడ్జెట్ కంటే రూ.30 వేల కోట్లు తగ్గించిందని విమర్శించారు. కరోనా నేపథ్యంలో వలసలు పెరిగాయని, వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు వల్ల పని దినాలు తగ్గి పనులు లేక వ్యవసాయ కూలీలు, పేదలు నా అవస్థలు పడుతున్నారని వీరందరికీ ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. కేంద్రంలో ని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ వ్యవసాయ చట్టాలు రద్దు చేయాలని రైతాంగం సంవత్సరం పాటు ఢిల్లీలో పోరాటం చేసిందని ఈ పోరాటాలకు తలవొగ్గిన ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తామని చెప్పిఆచరణలో వాటిని దొడ్డిదోవన అమలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అ బడ్జెట్లో సిసిఐ కార్పొరేషన్ కి కేవలం లక్ష రూపాయలు కేటాయించిందని ఇంత తక్కువ కేటాయిస్తే పత్తి రైతులు తమ పంటకు ఎలా అనుకుంటారని ప్రశ్నించారు. సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నిర్వహించే ఆందోళనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసిందని తెలిపారు .ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు కారుచౌకగా అమ్మి వేస్తున్నారని విమర్శించారు. సదస్సులో రైతు సంఘం నాయకులు ఆళ్ల సాంబిరెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు వల్లూరి భారతి, మండల కార్యదర్శి టి.ప్రసాద్‌రెడ్డి, కౌలు రైతు సంఘం కార్యదర్శి ప్రకాష్‌రావు, సిఐటియు కార్యదర్శి వి.పూర్ణయ్య తదితరులు ప్రసంగించారు. **తెనాలి:**గత ఎనిమిదేళ్లుగా కేంద్రంలో దుర్మార్గమైన పాలన కొనసాగుతోందని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో యువతకు భవిష్యత్ లేకుండా చేస్తున్నారని సిఐటియూ జిల్లా కోశాధికారి మంచికలపూడి సాంబశివరావు అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ ఐదున నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమం పై అవగాహన సమావేశం గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. కొలనీడు రవికుమార్ అద్యక్షతన జరిగిన సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు, 60 సంవత్సరాలు దాటిన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలలకు నెలకు రూ.5వేల పింఛన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లతో ఏప్రిల్ 5న చేపట్టిన ఛలో ఢిల్లీ విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభత్వం చట్టం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు షేక్ హుస్సేన్‌వలి, ముద్దన సాంబశివరావు, ములకా శివకుమారి, జి.వెంకటసుబ్బయ్య, ఆర్ వెంకటేశ్వర్లు, దేవళ్ళ శ్రీను, పి.వసంతి, జయలక్ష్మి పాల్గొన్నారు.



కాజలో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్



తెనాలిలో మాట్లాడుతున్న సాంబశివరావు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :జిల్లాలో పోగొట్టుకున్న సెల్ ఫోన్లు బాధితులకు ఫోన్లు అప్పగింత ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా ఎస్పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. గురువారం పలువురికి ఆయన సెల్‌ఫోన్లు అప్పగించారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుల కొరకు ఏర్పాటు చేసిన వాట్సప్ నెంబర్ 8688831574 సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వాట్సప్ నెంబర్ ఉపయోగించుకొవాలని కోరారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి లో నివాసం ఉంటున్న వెంకట నారాయణ జిల్లా ఎస్పీ తో మాట్లాడుతూ తాను సత్తెనపల్లి లో కిరాణా దుకాణం నడుపుతున్నట్లు సరుకుల కోసం 2020 సంవత్సరంలో గుంటూరుకు వచ్చి, ఫోను పొగొట్టు కున్నా నని దొరకదని ఆశలు వదులుకున్నానని తెలిపారు. ఇటీవల సెల్ ఫోన్ వాట్సప్ నెంబర్ కు మేసేజ్ చేసాను వెంటనే పోలీసులు తాను పోగొట్టుకున్న సెల్ ఫోన్ రికవరీ చేసి అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు ఎస్పికి దన్యవాదాలు తెలిపారు. లీలా మాధురి, నల్లూరు వెంకటేశ్వర రావులకు కూడా ఫోన్లు అందించారు. ఎస్పి మాట్లాడుతూ ఎవరైతే ఫోన్లు పొగొట్టుకుంటారో వారు వెంటనే 8688831574 నెంబరుకు వివరాలు వాట్సాప్ చేయాలన్నారు. టెక్నికల్ ఎనాలసిస్ వింగ్ వెంటనే ఫోన్‌ను ట్రేస్ చేస్తుందన్నారు. ప్రత్యేక సిబ్బందితో బాధితులు స్టేషన్ కు రాకుండా నేరుగా వారు ఉన్న స్థలం నుండి ఫిర్యాదు చేసే విధంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫోన్ నెంబర్ 8688831574 ను వాట్సాఫ్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. మొబైల్ ఫోన్ లు పోగొట్టుకున్న బాధితుల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించడానికి ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటా మన్నారు. ఫిర్యాదుతో పాటు తగిన ఆధారాలు కూడా సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సి.ఐ. నరసింహ రావు ఐటీ కోర్ ఇన్చార్జి యస్.ఐ. వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక హోదా ఇవ్వాలి

ఎంపి గల్లా గల్లా జయదేవ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర బడ్జట్ లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని టిడిపి ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు. గురువారం లోక్ సభలో బడ్జెట్ పై ప్రసంగించిన టిడిపి ఎంపీ గల్లా జయదేవ్ కర్నాటకలోని అప్పర్ భద్రకు రూ. 5300 కోట్లు కేటాయించిన కేంద్రం పోలవరంకు ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. పోలవరంపై రూ.55,657 కోట్ల సవరించిన అంచనాలను ఆమోదించాలన్నారు. వైజాగ్ రైల్వే జోన్ ఊసే లేకపోవడం శోచనీయం అన్నారు. వైజాగ్, విజయవాడ మెట్రోలను పూర్తి చేయాలనీ విభజన చట్టం లో ఉంది. చట్టానికి కట్టుబడి వాటికి డబ్బులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. విభజన చట్టంలోని అంశాలకు వచ్చే ఏడాది జూన్ 2వ తేదీకి కాలం చెల్లుతుందన్నారు. ఈ లోగానే కేంద్రం ఏపీ విభజన హామీలను నెరవేర్చాలన్నారు.



హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధారణ తప్పనిసరి అని పాత గుంటూరు సి.ఐ. సి.హెచ్.సుబ్బారావు అన్నారు. హెల్మెట్స్ ధరించడంపై గురువారం స్థానిక పాత గుంటూరు మణి హోటల్ సెంటర్ వద్ద ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ యొక్క ప్రాముఖ్యత, హెల్మెట్ పెట్టుకుంటే కలిగే లాభాలు, హెల్మెట్ పెట్టుకోకపోతే కలిగే నష్టాలను సిఐ సుబ్బారావు వివరించారు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ పెట్టుకున్నట్ల యితే కనీసం ప్రాణాపాయం నుంచి రక్షింపబడడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. పలువురు ఎస్ఐలు, స్థానికులు పాల్గొన్నారు.



గుంటూరులో కాంగ్రెస్ పాదయాత్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాహుల్ గాంధీ ఇటీవల చేపట్టిన భారత్ జోడో యాత్రకు స్ఫూర్తిగా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గుంటూరులో కాంగ్రెస్ నాయకులు గురువారం హాథ్ సె హాథ్ జోడో అభియాన్ పాదయాత్ర నిర్వహించారు. తూర్పు నియోజకవర్గం లోని 57వ వార్డు ప్రెసిడెంట్ మల్లవరపు చిన్న, మల్లెల మెషే , చిన్నమ్మాయి అధ్వర్యంలో మంగళదాస్ నగర్ 1 వ లైన్ నుండి అంబేద్కర్ నగర్, వరకు జరిగింది. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ మాట్లాడుతూ నరేంద్ర మోడీ తుగ్లక్ పాలనను తరిమి కొట్టాలని ప్రజలు దాచుకున్న సొమ్మును అదాని లాంటి దొంగలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వటంలో విఫలమయ్యారని తెలిపారు. ఉన్నత విద్యను చదివిన లక్షల మంది నిరుద్యోగులుగా ఉండిపోతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచి 2024 లో కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. పార్టీ నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్, రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం పాల్ విజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రత్తయ్య, కార్యదర్శి చినపోల్ రేడ్డి, అహ్మద్ బాషా,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలపాటి అనిల్, నగర ఉపాధ్యక్షులు చెన్నంశెట్టి సాంబయ్య, సయ్యద్ జాని గోల్డ్, లిగల్ సెల్ చైర్మన్ సుదీర్ బాబు,యన్.యస్.యు.ఐ అధ్యక్షులు షేక్ కరిమ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ సుబాని, మల్లెల మెషే తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలను పోలీసుల దృష్టికి తీసుకురండి

ప్రజాశక్తి - నకరికల్లు

గ్రామాల్లో ఏవైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే కనుక వాటిని పోలీసుల దృష్టికి తీసుకురావాలని సత్తెనపల్లి డిఎస్పి బడే ఆదినారాయణ చెప్పారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్ లో సాంఘిక దురాచారాల నిర్మూలనా కార్యక్రమాన్ని మహిళా పోలీసులు, వాలంటీర్లతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఎస్పి మాట్లాడుతూ మహిళా పోలీసులు వాలంటీర్లు, గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే, చిట్ ఫండ్ కంపెనీలు, మల్టీ మార్కెటింగ్ వ్యవస్థ ద్వారా గొలుసుకట్టు మోసాలను తెలియపరచాలని అన్నారు.



సాంఘిక దురాచారాల నిర్మూలనా కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్తెనపల్లి డిఎస్పి ఆదినారాయణ

రైతుల దగ్గర పంట కొనుగోలు చేసి ఐపిలు పెట్టే వ్యాపారస్తుల వివరాలు, గ్రామాల్లో రౌడీయిజం చలాయించే వారి వివరాలను వాలంటీర్లు తెలియజేయాలని, ఈ వివరాలు తెలియజేసిన వారి గురించి గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఆకతాయిలు, మురికి వాడల్లో అసాంఘిక కార్యక్రమాలు, నాటుసారా, బాల్యవివాహాలపై తమకు సమాచారం అందిస్తే పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించి వాటి నిర్మూలనకు చర్యలు చేపడుతుందని చెప్పారు. మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలపై పోలీస్ శాఖ దృష్టి సారిస్తుందని, ప్రతి గ్రామానికి ఒక కానిస్టేబుల్‌ను కేటాయించామని, మహిళా పోలీసులు, వాలంటీర్లు సమన్వయంగా పనిచేసి గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా ప్రయత్నిస్తారన్నారు. సత్తెనపల్లి రూరల్ సిఐ ఉమేష్, ఎస్సై సురేష్, ఎఎస్ఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్ళచెరువు పత్తి రైతులను ఆదుకోవాలి: టిడిపి

ప్రజాశక్తి-అచ్చంపేట

తాళ్ల చెరువులో సిక్సర్ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ఎన్నిమార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకునే నాథుడే లేరని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ విమర్శించారు. గురువారం తాళ్ళచెరువులోని రైతులతో ఆయన మాట్లాడారు. తాళ్ళచెరువులో 600 ఎకరాలలో సిక్సర్ సీడ్ పత్తి విత్తనాలు వేసి నష్టపోయామని రైతులు తమ గోడును వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ శాఖాధికారులు, ఎడి,జాయింట్ కలెక్టర్ ,కలెక్టర్‌ను కలిసి మొరపెట్టుకుంటే హామీ ఇచ్చారే గాని ఇంతవరకూ నష్ట పరిహారం మాత్రం ఇవ్వలేదని, లాంపారం విత్తన పరిశోధన శాస్త్రవేత్తలు కూడా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నష్టపరిహారం అందించాలని కోరుతూ వ్యవసాయ శాఖాధికారులు, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌ను, చివరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కలిసినా రైతుల బాధలు ఆలకించే వాళ్ళు లేరని కొమ్మాల పాటి శ్రీధర్ మండిపడ్డారు. నష్టపోయిన రైతుల కోసం న్యాయపోరాటం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. శ్రీధర్ వెంట మండల టిడిపి అధ్యక్షుడు ఎన్.ఆశీర్వాదం, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. సదాశివరావు ఉన్నారు

అచ్చంపేటలో టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్చంపేట

మండల కేంద్రం అచ్చంపేటలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ప్రారంభించారు . రానున్న ఎన్నికల కోసం టిడిపి కార్యకర్తలు సైనికుల పని చేసే పార్టీని అధికారంలో తీసుకురావాలని సూచించారు. అక్కడ నుండి మెయిన్ రోడ్ లోని దుకాణాలలోని వ్యాపారస్తులను, ప్రజలను పలకరిస్తూ ర్యాలీ నిర్వహించారు.



చేతిరాత పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌ను మదర్ ఆంతోనమ్మ (మేనేజర్ ఆఫ్ స్కూల్స్ కాలేజెస్), అసిస్టెంట్ మదర్ ఆంటోనీ మేరీ గురువారం సందర్శించారు. వేద అకాడమి, ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన చేతిరాత పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జూనియర్స్ విభాగంలో రెండవ బహుమతి పొందిన పి.అమృత, సీనియర్స్ విభాగంలో బహుమతి పొందిన ఎ. సువర్షిణి లకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనను వారు తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్క విద్యార్థిలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి బయటకు తీయాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మేరీ రజిత, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, బురాన్, పూర్ణచంద్రరావు, పద్మ, మౌనిక, సాయి లక్ష్మి, ఏడుకొండలు, మూర్తి, అనూష పాల్గొన్నారు.

ఉద్యోగుల నుండి విధిగా టిడిఎస్ వసూలు

ఇన్‌కమ్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉద్యోగుల నుండి ప్రతినెలా టిడిఎస్ వసూలు చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాలని డిప్యూటీ కమిషనర్ ప్రేమ్‌కుమార్, ఆదాయ పన్ను అధికారి ఎస్.జగదీష్ అధికారులకు సూచించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. టిడిఎస్ విజయవాడ రేంజ్ కమిషనర్ మేఘనాథ్ చౌహాన్ ఆదేశాలను అనుసరించి అధికారులు ట్యాక్స్ వసూళ్లు, చెల్లింపులు చేయాలన్నారు.



అన్ని రకాల సెలవులు ఎస్ఆర్‌లో నమోదు చేయండి

ఎన్‌జిఒల ఉద్యోగస్తుల సంఘం

ప్రజాశక్తి-నరసరావుపేట

అన్ని రకాల సెలవులను ఎస్ఆర్‌లో నమోదు చేయాలని ఎన్‌జిఒల ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షులు ఎమ్. రామకృష్ణ అన్నారు. ఈ మేరకు నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర కు గురువారం వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందని చెప్పారు. సమస్యలపై మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని అన్నారు.



నరసరావుపేట కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జిఒ ఉద్యోగస్తులు

కార్యక్రమంలో ఎన్‌జిఒల సంఘం కార్యదర్శి ఆనంద్ నాథ్, వైస్ ప్రెసిడెంట్ రవికుమార్, ఈసి సభ్యుడు అల్లాబక్షు, పల్నాడు జిల్లా గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు రమేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ జగదీష్‌బాబు, జాయింట్ సెక్రటరి లౌబాబు పాల్గొన్నారు.



ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - రెంటచింతల

పల్నాడు ప్రాంతంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ నూతన కార్యవర్గం గురువారం బాధ్యతలు చేపట్టింది. సత్తెనపల్లి ఎండోమెంట్ ఇన్ స్పెక్టర్ లీలావతి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ నూతన అధ్యక్షులుగా బి. బ్రహ్మారెడ్డి, సభ్యులుగా కొండా నాయక్, డి.కమలమ్మ, జి.పెద్ద సైదులు, యు. పద్మావతి, ఎ.నర సింహారెడ్డి, జె.పేరమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యులుగా పూజారి శర్మ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి ఎంపిపి డి.చౌడేశ్వరి, సర్పంచ్ ఉదయ్ కుమారి, ఆలయ మాజీ చైర్మన్ మట్టారెడ్డి, పిచ్చయ్య వైసిపి మండల కన్వీనర్ రామయ్య ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాత్రికులకు అసౌకర్యం కలగొద్దు

ఎండోమెంట్ డిసి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - రెంటచింతల

ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎండోమెంట్ డిసి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సత్రశాలలో నూతన చైర్మన్ బ్రహ్మారెడ్డి నేతృత్వంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ డిసి మాట్లాడుతూ భక్తులకు రవాణా సౌకర్యాల తోపాటు కృష్ణానదిలో స్నానాలకు ఏర్పాట్లు, తలనీలాలు సమర్పణ స్వామివార్ల కళ్యాణం, మంచినీటి సౌకర్యం తదితర ఏర్పాట్లను చూడాలన్నారు అదనపు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, వైద్య శిబిరం ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.పుల్లారావు, ఎంపిడిఒ గౌసియా బేగం, వైద్యాధికారి కృష్ణారెడ్డి, ఆర్టిసి డిఎం పిచ్చయ్య, ఎండోమెంట్ ఎసి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, సాయి మార్కొండరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే గంజాయి కేసులా? : టిడిపి

ప్రజాశక్తి-నరసరావుపేట

తప్పుడు కేసులు,అక్రమ అరెస్టులకు అడ్డాగా రాష్ట్రం మారిపోయిందని, సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే అక్రమ కేసులు బనాయించటం దుర్మార్గమని నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు పెట్టారన్న కారణంతో టిడిపి కార్యకర్త అజయ్ అమత్‌ని నరసరావుపేట రెండవ పట్టణ పోలీసులు గంజాయి కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన, టిడిపి నాయకులు,కార్యకర్తలు, లీగల్ సెల్



సిఐతో మాట్లాడుతున్న చదలవాడ అరవిందబాబు

సభ్యులతో కలిసి నరసరావుపేట రెండవ పట్టణ పోలీసు స్టేషన్ లో గురువారం అజయ్‌ని కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాల్ని, వైసీపీ నేతల అక్రమాలను ప్రశ్నించిన వారిని అక్రమ కేసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. వైసిపి ప్రజాస్వామ్యాన్ని, ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తోందని విమర్శించారు. టీడీపీ కార్యకర్తల పై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదన్నారు.

వేద సంస్థల డైరెక్టర్ శ్రీగిరి యెహోయాకిన్ గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట



పట్టణంలోని వేద సంస్థల డైరెక్టర్ శ్రీగిరి యెహోయాకిన్ (61) గుండె పోటుతో మృతి చెందారు. హైదరాబాదులో ఉన్న ఆయనకు బుధవారం రాత్రి తీవ్రమైన గుండె పోటు రావడంతో కోకాపేటలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి 10 గంటల సమయంలో ఆయన మృతి చెందారు. యెహోయాకిన్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ఎఎంజి డైరెక్టర్ డాక్టర్ అరుణ కుమార్ మహంతి, కుటుంబసభ్యులు బుధవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్లారు. ఎఎంజి, ఫోర్ కార్నర్స్ , వేదా సంస్థల వ్యవస్థాపకులు, సంఘ సేవకుడు డాక్టర్ జాన్ డేవిడ్ కు యెహోయాకిన్ మూడవ అల్లుడు. ఆయన భార్య పెర్సి స్వరూప. ఆమె కూడా వేద సంస్థల డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. యెహోయాకిన్ సోదరి, సోదరుడు అమెరికాలో నివాసం ఉంటున్నారు. వారు ఇక్కడికి వచ్చిన తర్వాత సమాధి కార్యక్రమం తేదీ తెలుపుతామని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.ఆయన మృతిపైఎఎంజి,ఫోర్ కార్నర్స్, వేద సంస్థల సిబ్బంది దిగ్భ్రాంతికి లోనయ్యారు.

మున్సిపాల్టి కాంట్రాక్టర్ మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట



స్థానిక మున్సిపాల్టిలో క్లాస్-2 కాంట్రాక్టర్ శనివారపు సాంబశివరావు(65) గురువారం మృతి చెందారు. సాంబశివరావు స్వగ్రామం కొల్లుపురం మండలం అత్తోటలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. ఐదు రోజుల క్రితం ఆయన మోటారు సైకిల్‌పై వెళుతూ అదుపుతప్పి స్థానిక విజయ బ్యాంక్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. చికిత్స నిమిత్తం గుంటూరులో ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. చేసిన కాంట్రాక్టు పనులకు సంబంధించిన బిల్లుల డబ్బులు ఇంకా రాకపోలేదన్న దిగులుతో ఉన్న సాంబశివరావు అనారోగ్యంపాలై, మృతి చెందినట్లు సమాచారం.

కాంట్రాక్టర్లు ఆందోళన చెందొద్దు: కమిషనర్

పట్టణంలోని సుమారు 9 మంది కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై కమిషనర్ సిహెచ్ గోవిందరావును వివరణ కోరగా బిల్లులకు సంబంధించి ఐదారు కోట్ల రూపాయలు రావాల్సిన మాట వాస్తవమేనని అన్నారు. ఇటీవల కాలంలో కోటి రూపాయలు విడుదల చేసినట్లు చెప్పారు. సిఎఫ్ఎంఎస్ పని చేయడం లేదని, బిల్లుల డబ్బులు త్వరలో ఇచ్చేలా ఏర్పాటు చేశామని, కాంట్రాక్టర్లు ఆందోళన చెందొద్దని చెప్పారు.



ఫ్లెక్సీలను పరిశీస్తున్న పోలీసులు

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నినాదంతో భారీ ఫ్లెక్సీలు

ప్రజాశక్తి - తాడేపల్లి:

డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ అనే నినాదంతో తాడేపల్లి పట్టణంలో భారీ ఫ్లెక్సీలను డిఎస్పీ రాంబాబు పర్యవేక్షణలో ఎస్ఐ నారాయణ, వినోద్‌లు ఏర్పాటు చేస్తున్నారు. తాడేపల్లి బైపాస్ సీఎం క్యాంప్ కార్యాలయం సమీపంలో, పట్టణంలో పలు ప్రాంతాలలో ఈ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. యువతకు అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీల పై మాదక ద్రవ్యాల వలన జరిగే అనార్ధాలను తెలుపుతూ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల పై రాష్ట్ర పోలీసు,ఎస్ఇబి ఉచిత ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేశారు.

నేడు మండల్ టు ఉద్యమం

ప్రజాశక్తి -మంగళగిరి

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన శుక్రవారం మంగళగిరి పట్టణంలో మండల్ టు ఉద్యమం పేరిట భారీ ర్యాలీ, బహిరంగ సభ కార్యక్రమాలను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాత మంగళగిరిలోని సీతారామ కోవెల వద్ద ర్యాలీ ప్రారంభమవుతుందని అక్కడి నుంచి మిద్దె సెంటర్, మెయిన్ బజార్, గాలిగోపురం గౌతమ బుద్ధ రోడ్డు వెంబడి గల అంబేద్కర్ విగ్రహం మీదగా ఈద్గా సమావేశ మందిరానికి చేరుతుందని చెప్పారు. ర్యాలీ అనంతరం ఈద్గా సమావేశ మందిరంలో బహిరంగ సభను నిర్వహించినట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాలకు సుమారు 3 వేల మంది హాజరవుతారని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు.



సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎన్ఎస్ఎస్ డిపిఒగా డాక్టర్ సుధీర్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా, జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్.జె.వి.సుధీర్ కుమార్‌ను గుంటూరు జిల్లాకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారిగా ఏఎన్‌యు వీసీ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ నియమించారని కళాశాల ప్రిన్సిపాల్ ఏబిపి. మనోహర్ తెలియచేశారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో సుధీర్‌కుమార్‌కు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు అదనపు అర్హత కల్పించిన ఏఎన్‌యు వీసీకి, తనకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తున్న కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ తెల్లాకుల శ్రీనివాసబాబుకు, ప్రిన్సిపాల్ మనోహర్‌కు, తనకు ర్హత కల్పించిన ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్. పి. రాజ శేఖర్‌కు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవి శేఖర్‌కి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్



ఎంఈఓ కు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

ఫిబ్రవరి 9వ తేదీ వచ్చినప్పటికీ ఉపాధ్యాయులకు జీతాలు పడకపోవడంతో జీతాలు వెంటనే చెల్లించాలని మండల యుటిఎఫ్ నాయకులు గురువారం మండల విద్యాశాఖ అధికారి బాలసుబ్రమణ్యంకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి నెల ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని, పిఆర్సి ఏరియర్స్ ,పిఎఫ్ లోనులు, ఏపీజిఎల్ఐ క్లైములు వెంటనే ఇప్పించాలని వారు కోరారు.

మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

యుటిఎఫ్ పెదనందిపాడు మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవం గురువారు ఎన్నుకున్నారు. పెదనందిపాడు యుటిఎఫ్ మండల నూతన అధ్యక్షులుగా ఎన్ రామకృష్ణ , గౌరవ అధ్యక్షులుగా ఎం. సత్యనారాయణ, సహాధ్యక్షులుగా టి. శివ పార్వతి, ప్రధాన కార్యదర్శిగా వి. వంశీధర్, కార్యదర్శులుగా సిహెచ్. రామారావు, బి. చక్రవర్తి,బి. అనురాధ, కోశాధికారిగా వి . వెంకటేశ్వరరావు, జిల్లా ప్రతినిధులుగా బి .శ్రీనివాసరావు, ఎస్.కె సైదా, సిపిఎస్ కన్వీనర్‌గా ఎం. మోహన్‌రావు మండల ఆడిట్ కన్వీనర్‌గా వి. చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎరువులు అధిక మోతాదులో వాడితే నష్టం

ప్రజాశక్తి-తెనాలి: వ్యవసాయ శాఖ అధికారులు సూచనల మేరకే ఎరువులు ఉపయోగించాలని, అధిక మోతాదులో ఎరువుల వినియోగం నష్టమేనని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెకంటేశ్వర్లు చెప్పారు. రూరల్ గ్రామాలు అంగలకుదురు, పినపాడు, పెదరావూరు, కంచర్లపాలెం, గుడివాడ, నందివెలుగు గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించి పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు ఈ- క్రాప్ నమోదును వారంలోగా పూర్తి చేసుకోవాలన్నారు. ఎరువురు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ డాక్టర్ ప్రవీణ చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, విఏఎలు దీపిక, లక్ష్మి, ఏంజల్, హాగ్ల, సంసోనమ్మ, అనూష,మౌనిక, పలువురు రైతులు పాల్గొన్నారు.

200 టన్నుల యూరియా దిగుమతి

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్ :మండలంలోని రైతుల అవసరాల మేరకు 200 టన్నులు యూరియా దిగుమతి చేసుకున్నామని మండల వ్యవసాయ అధికారి బి.సుధారాణి తెలిపారు. మండల గ్రామాల్లోని రైతులు సౌకర్యార్థం పెదనందిపాడు మన గ్రోమోర్ సెంటర్లో 120 టన్నులు, నాగులపాడు మార్కెట్ యార్డులో 20 టన్నులు, పాలపర్రు రైతు భరోసా కేంద్రంలో 20 టన్నులు, అన్నపర్రు రైతు భరోసా కేంద్రంలో 20 టన్నులు, పుసులూరు సొసైటీలో 20 టన్నులు, చొప్పున స్టాకు రైతులుకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు కూడా తమ పంటలకు అవసరమైన మోతాదులోనే యూరియా వాడుకోవాలన్నారు. అధికంగా వాడటం వలన భూసారం దెబ్బ తింటుందన్నారు

యూనివర్సల్ కళాశాలలో క్రీడా ఉత్సవం

ప్రజాశక్తి- మేడికొండూరు.

మండలంలోని డోకిపర్రు యూనివర్సల్ కాలేజ్‌లో జాతీయ సాంకేతిక సాంస్కృతిక క్రీడా ఉత్సవం 2కె 23ను అట్టహాసంగా గురువారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఏపీ విట్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అధ్యక్షతన జరిగిన వేడుకల్లో డాక్టర్ కోటారెడ్డి మాట్లాడుతూ మంచి భవిష్యత్తు కోరుకోవాలి అంటే కలలుగనాలని, ఉన్న ప్రతి సదుపాయాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ టెక్నాలజీలో నూతన ఒరవడులను తెలుసుకుంటూ భవిష్యత్తు కొరకు సన్నద్ధం కావాలని అన్నారు. విజయానికి షార్ట్ కట్స్ ఉండవని హార్డ్ వర్క్‌ను మాత్రమే నమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్ పో, కోడింగ్ హేకదాన్, పోస్టర్ ప్రజెంటేషన్, టీమ్



జ్యోతి ప్రజ్వలన చేసి పారంభిస్తున్న డాక్టర్ ఎస్ వి కోటారెడ్డి

పెయింటింగ్, షార్ట్ ఫిల్మ్, క్రియేటివ్ ఫోటోగ్రఫీ, సింగింగ్ కాంపిటీషన్, ఫ్యాషన్ పరేడ్, స్పోర్ట్స్ ఈవెంట్స్ వాలీబాల్, త్రో బాల్, 100 మీటర్, 400 మీటర్ స్ప్రింట్ , షాట్ పుట్ పోటీలు నిర్వహించారు. ప్రతి ఈవెంట్లో విన్నర్, రన్నర్లకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ , కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ మర్రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరెడ్డి, వివిధ విభాగధిపతులు అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లిగ్రామంలో సుమారు రూ.48 లక్షల నిధులతో కొండవీటి వాగు పక్కన గల హిందూ శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురువారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఆప్కో చైర్మన్ గంజి



చిరంజీవి , ఎంటిఎంసి డిఇ శ్యామల కృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ, మెరకలు, మౌలిక సదుపాయాల పనులు తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

తమ స్థలంలో పెన్సింగ్ వేస్తున్నారని ఆందోళన

ప్రజాశక్తి -మంగళగిరి

తమకు చెందిన స్థలంలో దేవాదాయ ఎండోమెంట్ శాఖ భూమి అంటూ దేవస్థాన అధికారులు పెన్షింగ్ వేశారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాయి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మంగళగిరి పట్టణంలోని శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి వారి ఘాట్ రోడ్డు వెంబడి సర్వే నెంబర్ 232/1 లోని భూమిలో దేవస్థాన అధికారులు పోలీసుల సమక్షంలో పెన్షింగ్ వేసే పనులు చేపట్టారు. దీంతో తాయి శ్రీనివాసరావు, తాయి సుధీర్‌లు సదరు స్థలం వద్దకు చేరుకొని ఫెన్సింగ్ పనులను నిలుపుదల చేయాలని పట్టు బట్టారు. సమస్య ఉంటే న్యాయపోరాటం చేయాలని అధికారుల చర్యలకు అడ్డు రావద్దని ఎస్ఐ నారాయణ, మహేంద్రలు తెలిపారు. ఈ నేపథ్యంలో దేవస్థాన అధికారుల తీరు పట్ల శ్రీనివాసరావు నిరసన వ్యక్తం చేశారు. పెన్షింగ్ వేయటానికి తాము కొనుగోలు చేసుకున్న స్థలమే కనపడిందా అంటూ ప్రశ్నించారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఎలా పెన్షింగ్ వేస్తారని అన్నారు. స్థలానికి చెందిన బీఫారం పట్టా కూడా తమ వద్ద ఉందని తెలిపారు. 3-6 డోర్ నంబర్‌తో ఓ పూరి గుడిసె ఉండగా దాని స్థానంలో రేకుల షెడ్డు వేసుకునేందుకు గుడిసెను తొలగించి చదును చేయించామని చెప్పారు. తమ కష్టార్జితంతో కూడబెట్టుకున్న సొమ్ముతో కొనుగోలు చేసిన స్థలాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు దేవస్థాన అధికారులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని (ఆర్కే)ని కలిసి పరిస్థితిని వివరించగా పెన్షింగ్ వేయకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని అయినా యథావిధిగా పనులు జరుపుతున్నారని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు తాయి సుధీర్ అన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఇదే ప్రాంతంలో దేవస్థానానికి చెందిన భూమిలో పలు అక్రమ నిర్మాణాలు ఉన్నప్పటికీ వాటిని చూసి చూడనట్లు వదిలేశారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అది దేవస్థానానికి చెందిన భూమి: ఆలయ ఈఓ రామకోటి రెడ్డి

232/1 ఒరిజినల్ సర్వే నంబర్‌కు బదులుగా 231/3 సర్వే నంబర్‌గా సదరు స్థలాన్ని మార్చి తాయి శ్రీనివాసరావు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు. అందుకే పెన్షింగ్ వేశామని కక్ష పూరితం కాదని అన్నారు.



సీతామహాలక్ష్మిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ బృందం

భజన కళాకారిణి సీతామహాలక్ష్మికి సత్కారం

ప్రజాశక్తి- తెనాలి:శకపురుషుని శతజయంతి మహోత్సవాల్లో భాగంగా స్థానిక బోస్ రోడ్‌లోని పెమ్మసాని థియేటర్లో గురువారం ఎన్టీఆర్ నటించిన రాము చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. సత్కారాల పండుగలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ భజన కీర్తన కళాకారిణి కొక్కిలిగడ్డ సీతమహాలక్ష్మిని థియేటర్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ టిడిపి నాయకులు ఎం.లక్ష్మీకుమారి, చందు కోటేశ్వరమ్మ, నాగదేవ లక్ష్మి, ఎం. కోటేశ్వరరావు, ఈ.శ్రీని వాసరావులు సత్కరించారు. పెమ్మసాని పోతురాజు,డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లిభవాని, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టిభాస్కర్, జి.ప్రసాద్, ఎన్. శ్రీనివాస్, బి.కోటేశ్వరరావు, డి. శ్రీను, రాజకుమారి, వి.కృపారావు, ఎం.సుజాత పాల్గొన్నారు.



సమావేశంలో ద్వారకా తిరుమల రావు,కెఎల్‌యు విద్యార్థులు

బిజెనెస్ మెళుకువలకు 'ఒన్ మినిట్ మేనేజర్'

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో మెళుకువలు తెలుసుకోవడం కోసం విద్యార్థులు ఒన్ మినిట్ మేనేజర్ అనే పుస్తకం చదవాలని కెఎల్ విశ్వవిద్యాలయం ఎంబిఎ విద్యార్థులకు ఏపీఎస్ ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు సూచించారు. గురువారం ఆర్‌టిసి హౌస్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన కాఫి విత్ సిఈఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళితే అనుకున్నది సాధించవచ్చని అన్నారు. మనం చేరాలనుకునే గమ్యం మనం వెళ్ళే దారి మీదనే ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి తన ఒక ప్రాథమిక అంశాలను మరువకూడదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో విసి.డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, అద్యాపకులు డాక్టర్ జెవి.రమణ, డాక్టర్ సిహెచ్.బాలాజి పాల్గొన్నారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

రాజధాని రోడ్ల తవ్వకాలపై టిడిపి నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధానిలో రోడ్లను రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, లారీల్లో రోడ్ల నిర్మాణ మెటీరియల్ గ్రావెల్, ఇసుక, కంకర అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని టిడిపి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాలకు సమీపంలో రోడ్డు తవ్వేసిన ప్రాంతంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమరావతిని నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగంగానే రోడ్లు ధ్వంసం,ఇసుక, గ్రావెల్ తరలింపు యథేచ్ఛగా సాగుతోందని ,అధికార పార్టీకి చెందిన కొంతమంది రోడ్లను తవ్వేస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు . ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు తక్షణమే స్పందించి రోడ్ల తవ్వకాలను నిలువరించాలని, లేనిపక్షంలో టిడిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ధనేకుల సుబ్బారావు, పి.రామ చంద్రరావు, కె. అప్పారావు, జె.ఏడుకొండలు, ఎం రవికుమార్, ఎం.నాగేశ్వరరావు, ఎ.సువర్ణ కమల, ఎ.నాగ మల్లీశ్వరి, బి. ప్రియాంక, గడ్డం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్థలాల కబ్జాపై విచారణ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : గుంటూరు కార్పొరేషన్‌కు చెందిన స్థలాలను కబ్జా వ్యవహారంపై విచారణ చేస్తున్నట్టు టౌన్ ప్లానింగ్ విభాగం ఇన్‌ఛార్జి సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. 'ప్రజాశక్తి దినపత్రిక' లో గురువారం ప్రచురితం అయిన కబ్జా కోరల్లో కార్పొరేషన్ స్థలాలు శీర్షికన వచ్చిన వార్తపై ఆయన స్పందించారు. నగరపాలక సంస్థ పరిధిలోని శారదాకాలనీలో రహదారి విస్తరణలో ఒక చర్చి స్థలం అవసరం కాగా వారికి ఉన్న బిఫారం స్థలం కార్పొరేషన్‌కు ఇచ్చారని తెలిపారు. అందుకు ప్రతిగా మరో స్థలం కేటాయించినట్టు తెలిపారు. అయితే బి.ఫారం స్థలంతో పాటు మరికొంత అదనం స్థలంలో నిర్మాణం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు కమిషనర్ చెరుకూరి కీర్తి అనుమతితో నగర పాలక సంస్థ సిటీ ప్లానర్ మూర్తి ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు, రేపు ఆర్‌విఆర్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు : ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి 38వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 10,11వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండ్రోజుల వేడుకల్లో మొదటి రోజు కొలోరిడో-2023 పేరుతో జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. తొలిరోజు వేడుకలకు ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ కె.రామమోహన్‌రావు, తెలుగు చలన చిత్ర నవ హీరో అట్లూరి రక్షిత్ పాల్గొంటారని తెలిపారు. రెండవ రోజు వేడుకల్లో టిసిఎస్ వైస్ ప్రెసిడెంట్ అండ్ గ్లోబల్ ఆర్‌ఎమ్‌జి హెడ్ ఈ.ఎస్.చక్రవర్తి, తెలుగు చలన చిత్ర నవ హీరో కాకాని ధర్మమహేష్ పాల్గొంటారన్నారు. రెండ్రోజుల వేడుకల్లో జానపద, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు , వెస్టన్ డాన్స్ , మిమిక్రి , గీతాలాపన , లఘు నాటికలు విద్యార్థులు ప్రదర్శిస్తారన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-గుంటూరు : వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈ-సెల్, నిపమ్ (నేషనల్ ఇంటెలెక్చుయల్ ప్రాపర్టీ అవేర్‌నెస్ మిషన్) సంయుక్త ఆధ్వర్యంలో ' వర్చువల్ వర్క్‌షాప్ ఆన్ ఐపీఆర్ అవేర్‌నెస్' అనే అంశంపై విద్యార్థులకు గురువారం అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమానికి చెన్నై, ఇండియన్ పేటెంట్ ఆఫీస్‌లోని పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎగ్జామినర్ వి.తిలక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలని, సరికొత్త ఇన్నోవేషన్స్‌ను సృష్టించే విద్యార్థులు వాటిపై పేటెంట్స్‌ను పొందడం వలన దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు పేటెంట్స్‌ను సాధించడానికి ఎలా ప్రయత్నించాలో దశల వారీగా వివరించారు. రీసెర్చ్ జర్నల్స్‌కు పేటెంట్స్‌కు మధ్య వ్యత్యాసాలను తెలిపారు. పేటెంట్, డిజైన్, ట్రేడ్‌మార్క్, కాపీరైట్, జియోగ్రాఫికల్ ఇండికేషన్, ఎస్ఐసీఎల్‌డీ, ట్రేడ్ సీక్రెట్, ట్రెడిషనల్ నాలెడ్జ్, గ్రాడ్యుయేషన్ తర్వాత విద్యార్థులకు ఉన్న కెరీర్ ఆపర్చునిటీస్ వంటి అంశాలను వివరించారు. విద్యాసంస్థల నుంచి దరఖాస్తు చేసే పేటెంట్‌లకు గతంలో ఉన్న రూ.25 వేల ఫీజును ప్రభుత్వం రూ.5600కు తీసుకువచ్చిందని తెలియజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ ఈ-సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కిట్స్‌లో ఈ-మార్గ్



వందన వెలగపూడిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు : కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో ఈ-సెల్ తరపున ఈ-మార్గ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేఫ్ ఎన్విరాన్ అసోసియేట్స్ వ్యవస్థాపకులు, యంగ్ ఇండియన్స్ అమరావతి ఛాప్టర్ కోఛైర్‌పర్సన్ వందన వెలగపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు వినూత్న పద్ధతుల్లో ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మారటానికి వారిని ఎలా మెరుగుపరుచుకోవాలి, టైమ్ మేనేజ్‌మెంట్, సమస్య నుంచే పరిష్కారం దొరుకుతుందనే అంశాలను ఆమె విద్యార్థులకు తెలియజేశారు. అలాగే కంపెనీ మొదలు పెట్టటానికి కావాల్సిన ప్రాధమిక అవసరాల గురించి వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఈ-సెల్ కన్వీనర్ డాక్టర్ కె.పూర్ణకిషోర్, డాక్టర్ ఎన్.అరవింద్ పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో రాయపాటి మోహనసాయి కృష్ణ, కృష్ణప్రసాద్ తదితరులు

కెఎల్‌పి స్కూల్లో జిల్లా స్థాయి స్పెల్‌బీ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో గురువారం జిల్లా స్థాయి స్పెల్‌బీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 29 పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాయపాటి మోహనసాయికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సరళ ఇంగ్లీషు పదాల నుండి కఠిన పదాలను నేర్చుకొని భాషను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆంగ్లభాషపై పట్టు సాధించటానికి ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి ప్రొఫెసర్ సుజాత, జెకెసి కాలేజి ప్రొఫెసర్ నాగసుశీల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో కెఎల్‌పి స్కూల్, వివా దిస్కూల్, వెంకటేశ్వరా బాలకుటీర్ వరుసగా ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. విజేతలకు నగదు బహుమతి అందచేశారు.

11,12 తేదీల్లో గుంటూరు సీతారామయ్య హైస్కూలులో నిర్వహించే

బాలోత్సవానికి తరలిరండి : ఎమ్మెల్సీ కెఎస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో 11, 12 తేదీల్లో జరిగే గుంటూరు జిల్లా బాలోత్సవానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యా యులు పెద్ద సంఖ్యలో రావాలని బాలోత్సవం అధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ బాలోత్సవంకు ముఖ్య అతిథిగా పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, విజ్ఞాన్స్ ఛైర్మన్ ఎల్.రత్తయ్య, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, వై.వి.ఆంజనేయులు, మలినేని పెరుమాళ్లు, వాసిరెడ్డి రమేష్‌బాబు, తదితరులు హాజరవుతారన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యం, వెస్టన్ డ్యాన్స్, శాస్త్రీయ సంగీతం, క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ మొదలైన 23 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమాశంలో జి.వెంకటరావు, బి.ఆదిలక్ష్మి, జి.వి.శ్రీనివాస్, ఎన్.భావన్నారాయణ, షేక్.పీరుసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



వాహనాలకు గ్యాస్ ఎక్కిస్తున్న ఐఒసి అధికారులు

ఆటోనగర్‌లో సిఎన్‌జి ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు సిఎన్‌జి, పిఎన్‌జి గ్యాస్ ఔట్ లెట్‌ను గురువారం ఆటోనగర్‌లో ప్రారంభించారు. ఆటోలు, కార్లు, ఇతర వాహనాలకు గ్యాస్ ఫిల్లింగ్ యూనిట్ లాంఛనంగా ప్రారంభించి వాహనాలకు గ్యాస్ ను నింపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల,ప్రకాశం, కర్నూలు,నంధ్యాల జిల్లా వాసుల కోసం ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. 25 ఏళ్ల పాటు వినియోగం కోసం ప్రైవేటు ఏజెన్సీతో ఒప్పందం చేసుకున్నారు. గ్యాస్ పైపు నిర్మాణంకోసం రూ.1420 కోట్లతో పైపు లైను నిర్మాణం చేపట్టారు. గుంటూరు, తెనాలి,మంగళగిరి తదితర పట్టణాలకు నిరంతరం సిఎన్‌జి గ్యాస్ సరఫరాకు ఈ ప్లాంట్ అవకాశంఉంది. పెట్రోలు, డిజిలు వినియోగం వల్ల కాలుష్యం పెరుగుతుందని అందువల్ల సిఎన్‌జి వినియోగంతో వాహనాల నిర్వహణ మెరుగుపడుతుందని తెలిపారు. తాడేపల్లి ఐఒసి లూబ్ ప్లాంట్ ద్వారా ఈ ప్లాంట్‌కు గ్యాస్ సరఫరా జరుగుతుందని తెలియజేశారు.



విద్యుత్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు అరండల్‌పేట,బ్రాడీపేట ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు గురువారం విస్తృతంగా తనిఖీ చేశారు. విజిలెన్సు విభాగం సూపరింటెండెంట్ ఇంజినీరు మందా అల్ఫాన్స్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు విజయకృష్ణ, ఆపరేషన్ విభాగం ఈఈ శ్రీనివాసబాబు తనిఖీల్లో పాల్గొన్నారు. అనుమతించిన కేటగిరి కన్నా అదనంగా విద్యుత్ వినియోగంపై తనిఖీలు చేసి ఐదు మందికి రూ.1.10లోలు, మరో 134 మందికి రూ.8.55 లక్షలు జరిమానా విధించారు. మొత్తం 59 మంది అధికారులు 177 మంది ఉద్యోగుల 59 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. 4692 సర్వీసులు తనిఖీ చేసి 139 మందికి రూ.9.65 లక్షల జరిమాన విధించినట్టు అధికారులు తెలిపారు.

మానవాళి మనుగడకు నూతన ఆవిష్కరణలు

వర్సిటీలో రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించిన విసి



ప్రజాశక్తి - ఎఎన్‌యు

మానవాళికి సంబంధించి వివిధ రకాలైన సమస్యలకు పరిష్కారాలు, మనుగడకు నూతన ఆవిష్కరణలు కనుగొనాలని విసి పి రాజశేఖర్ తెలిపారు. ఆచార్య నాగార్జునా యూనివర్శిటీలో రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమయ్యింది. జువాలజీ డిపార్ట్‌మెంట్ , అక్వాకల్చర్ సంయుక్త ఆధ్వర్యంలో ఇమ్యునాలజీ, అక్వాటిక్ టాక్సీకాలజీ మరియు బయోడైవర్సిటీ జాతీయ సదస్సులో విసి మాట్లాడారు. కొత్త కొత్త ఆలోచనల ఆవిష్కరణలకు ఈ సదస్సు దోహదం చేస్తుందని ఆయన అన్నారు. పరిశోధక విద్యార్థులు మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ సదస్సులోని వక్తలు చెప్పేటువంటి అంశాలను వారి పాఠ్యాంశాల లోని అంశాలకు జతచేసి కొత్త కొత్త ఆలోచనలను చేసినప్పుడే ఇటువంటి సదస్సుల యొక్క ఉద్దేశం నెరవేరుతుందని అన్నారు. గౌరవ అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్టర్ ప్రొఫెసర్ బండి కరుణ మాట్లాడుతు ఇటువంటి సదస్సులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. సదస్సు సమన్వయకర్త ప్రొఫెసర్ కె. సునీత మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయాల నుండి మరియు రీసర్చ్ సెంటర్ల నుండి వక్తలను ఆహ్వానించడం జరిగిందని చెప్పారు. ఉపకులపతి సదస్సుకు విచ్చేసిన వక్తలను మరియు జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగ ప్రొఫెసర్లను ఘనంగా సత్కరించారు. తరువాత విజ్ఞాన్ విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ ఎన్.ఎస సంపత్ కుమార్ మరియు డాక్టర్ సి.హెచ్. అంజనీ దేవి ప్రసంగించారు.సెంటర్ ఫర్ కంప్యూటేషనల్ అండ్ బయలాజికల్ సైన్సెస్ నుండి డాక్టర్ పి.జాన్ ప్రసంగించారు. సదస్సులో జువాలజీ మరియు ఆక్వా కల్చర్ విభాగ ప్రొఫెసర్లు పీ.వీ కృష్ణ, సింహాచలం, పద్మావతి, సుమంత్ కుమార్,జగదీష్ నాయక్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత కలిగి ఉండాలి : విసి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యత జాతీయ భావం క్రమశిక్షణ వంటివి కలిగి ఉండాలని వర్సిటీ విసి పి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ ఎం.దేదీప్య ఢిల్లీలో జరిగిన ఎన్‌ఎస్‌ఎస్ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరంలో భారత సైనికులతో పాటు నిర్వహించిన కవాతులో పాల్గొనడం అభినందనీ యమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు వైపు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మసి కళాశాల ప్రిన్సిపల్ ఏ ప్రమీలారాణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం రవి శేఖర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డి రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

